నిద్దరోతున్న నిఘా నేత్రాలు

- గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- నిర్వహణ లోపం.. ఏడాదిన్నరగా పనిచేయని వైనం
- పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్: ఒక్కో సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమంటూ పోలీసు అధికారులు ప్రకటనలు ఇవ్వడం మనం వింటున్నాం. దీనిని బట్టి సీసీ కెమెరాలకు పోలీసు విభాగంలో ఎంత ప్రాధాన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. చాలా రోజులుగా వీటి మరమ్మతులపై పోలీసులు కానీ అధికారులు గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

నిర్వహణ గాలికి..

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎనిమిది గ్రామాలు ఉండగా.. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో ఆరేళ్ల క్రితం అప్పటి సర్పంచ్‌లు, దాతల సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక్క గ్రామంలో 12 నుంచి 32 ఏర్పాటు చేశారు. వాటికి సంబంధించిన హార్డ్ డిస్క్, స్క్రీన్‌ను గ్రామ పంచాయతీల్లో పెట్టారు. సర్పంచ్‌లు పదవిలో ఉన్నంతకాలం సీసీ కెమెరాల నిర్వహణను స్వయంగా నిర్వహించారు. అయితే ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో



పనిచేయని సీసీ కెమెరా



సురంగల్ జీపీలో పనిచేయని సీసీ కెమెరాల స్క్రీన్

గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. వాటికి పంచాయతీల నుంచి నిధులు ఇవ్వలేమని ప్రత్యేక అధికారులు చెప్పి వాటి నిర్వహణ గాలికొదిలేశారు.

ఆరు నెలల క్రితం మున్సిపాలిటీగా..

మొయినాబాద్ మున్సిపాలిటీ ఏర్పడక ముందు మున్సిపల్ పరిధిలోని 8 గ్రామాలు సైతం పంచాయతీలుగానే ఉన్నాయి. ఆయా గ్రామాల్లోనూ అప్పట్లోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆరు నెలల క్రితం మున్సిపాలిటీగా ఏర్పడింది. అయినప్పటికీ సీసీ కెమెరాల ఏర్పాటు, మరమ్మతుల విషయంలో మున్సిపల్ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడం గమనార్హం. మున్సిపల్ పరిధిలోని చిలుకూరు, మొయినాబాద్, పెద్దమంగళారం, ముర్తూజగూడ, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, సురంగల్ గ్రామాల్లో.. మండల పరిధిలోని వెంకటాపూర్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి, తోలుకట్ట, అమ్డాపూర్, కాశీంబౌలి, చిన్నమంగళారం, వీరన్నపేట, రెడ్డిపల్లి, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, మేడిపల్లి, చందానగర్ తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. ఆయా గ్రామాల్లో కొంతమంది సొంతంగా ఇళ్లు, షాపులు, ఫాంహౌస్‌లలో ఏర్పాటు చేసిన కొన్ని సీసీ కెమెరాలు మాత్రం అక్కడక్కడ పనిచేస్తున్నాయి.

పెరుగుతున్న నేరాలు

గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నేరాలు పెరుగుతున్నాయి. గ్రామాల్లో దొంగతనాలు జరుగుతున్నా సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలు దొరకకుండా తప్పించుకుంటున్నారు. మరోవైపు గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు ఎక్కువవుతున్నాయి. వ్యవసాయ బోర్ల కేబుల్స్ కట్ చేసుకపోవడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగితీగలు దొంగలించడం వంటివి చాలా జరుగుతున్నాయి. గ్రామాల్లో నిఘా నేత్రాలు ఉంటే ఇలాంటి చోరీలు, నేరాలను అరికట్టవచ్చని స్థానికులు అంటున్నారు.

మరమ్మతులు చేయించాలి



గ్రామంలో చాలా రోజులుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పంచాయతీ అధికారులను అడిగితే తమకేమి సంబంధం లేదన్నట్లుగా సమాధానం చెబుతున్నారు. కెమెరాలు పనిచేయకపోవడంతో గ్రామంలో నేరాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సీసీ కెమెరాలు బాగుచేయించాలి.

–రాజమల్లేశ్, వీరన్నపేట, మొయినాబాద్ మండలం

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణను గతంలో సర్పంచ్‌లు చూసేవారు. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో వాటి నిర్వహణ సరిగా జరగడంలేదు. మొదటి ప్రాధాన్యతగా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నాం. దాతల సహకారంతో గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలకు మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

–పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్

క్లుప్తంగా

తెలంగాణ ఆడబిడ్డలకు అవమానం

బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కావ్యకృష్ణగౌడ్

చేవెళ్ల: వీరవనితలు పుట్టిన నేలపై తెలంగాణ ఆడబిడ్డలకు అవమానం జరిగిందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి గౌండ్ల కావ్య కృష్ణగౌడ్ అన్నారు. చేవెళ్లలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రపంచ అందాల పోటీలకు వచ్చిన యువతుల కాళ్లను మహిళలతో రాష్ట్ర ప్రభుత్వం కడిగించటం సరైందికాదన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మ అభిమానాన్ని అందాల పోటీలకు వచ్చిన వారి పాదాల దగ్గర పెట్టేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విదేశీ అందగత్తెలకు కాలు కడిగి రుమాలతో తుడిపించటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ చర్య మహిళలకే కాదు తెలంగాణ సమాజానికి అవమానకరమన్నారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వం పాల్పడటం దుర్మార్గమైనదన్నారు. దీనిపై ప్రభుత్వం ముఖ్యమంత్రి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ వనితల సత్తా చూపిస్తామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సురేందర్‌రెడ్డి

షాబాద్: పిడుగుపాటుకు గురై మృతి చెందిన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మక్తగూడ గ్రామానికి చెందిన సోలీపేట్ స్వరూప పిడుగు పడి మృతి చెందగా ఆమె కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కష్టకాలంలో ఉన్న ప్రతీ ఒక్కరిని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు, వేణుగోపాల్, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, అమరేందర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మలుపుల వద్ద చెట్ల కొమ్మలు తొలగించండి



మలుపు వద్ద ఏపుగా పెరిగిన చెట్లు

కొత్తూరు: ప్రమాదకరంగా మారిన మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకొని వాహనదారులు మృత్యువాతపడుతున్నారు. అయినప్పటికీ మండలంలో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లలో ప్రమాదకరంగా ఉన్న మూల మలుపులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడంలో అటు పంచాయతీరాజ్, ఇటు ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కొత్తూరు మండలం సిద్ధాపూర్ నుంచి కోళ్లపడకల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో ఉన్న మలుపుల వద్ద రోడ్లకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగాయి. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి మలుపుల వద్ద రోడ్డుకు అడ్డంగా పెరిగిన చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

బాధిత రైతుకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, గ్రామస్తులు

చేవెళ్ల: పిడుగుపడి ఓ రైతు రెండు ఎద్దులు మృతి చెందటంతో బాధిత కుటుంబానికి నాయకులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. మండలంలోని పామెన గ్రామంలో బుధవారం రాత్రి పిడుగు పడి రెండు ఎద్దులు మృతి చెందిన బాధిత రైతు సదానందంకు మండలంలోని పలువురు నాయకులు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. సోషల్ మీడియా, పత్రికల్లో వచ్చిన సమాచారానికి మండల నాయకులు, ప్రజలు స్పందించారు. రైతుకు నేరుగా కొందరు ఆన్‌లైన్ ద్వారా, మరికొందరు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అందించిన రూ.5వేల నగదును మాజీ సర్పంచ్ దవాల్‌గారి గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రణాళిక

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని సీఎస్‌కే గ్రీన్ విల్లాస్‌లో సుమారు రూ.40లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. టీడీఎస్ నిధులు రూ.25కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, రఘునాయక్, జమృద్‌ఖాన్, శ్రావణి, నాగమణి, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్‌రబ్ జామీ, సోమశేఖర్, సాదత్, శ్రీనివాస్ రెడ్డి, శివరాంరెడ్డి, శివానంద్, డాక్టర్ చందులాల్ రాథోడ్, బాలు, ఉస్మాన్, రజింత్, బబ్బన్ సింగ్, ఉపేందర్, చంద్రశేఖర్, సత్తయ్య, పాల్గొన్నారు.



డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాండ్ర శ్రావణ్‌రెడ్డి

కేశంపేట: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి మన్ననలు పొందాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాండ్ర శ్రావణ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధకశాఖలో ఖాళీలను ఇటీవల భర్తీ చేసింది. అందులో భాగంగా మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, పాపిరెడ్డిగూడ, కొండారెడ్డిపల్లి గ్రామాల్లోని పశు వైద్య ఉపకేంద్రాల్లో లైవ్ స్టాక్ అసిస్టెంట్లను కేటాయించింది. ఈ సందర్భంగా పాపిరెడ్డిగూడ గ్రామంలోని పశువైద్య ఉపకేంద్రంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా స్వప్న గురువారం విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులు పాడి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ఉద్యోగులు అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ నిఖిత, శివయ్య, అబ్బి సుందరయ్య, యాదయ్య, రాణి, రవీందర్, అంజనేయులు, సత్యంగౌడ్, రామస్వామి, రాంచందర్, భిక్షపతి, కృష్ణయ్య, శ్రీను, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



విధుల్లో చేరుతున్న లైవ్‌స్టాక్ అసిస్టెంట్ స్వప్న

నేడు చేవెళ్లలో రక్తదాన శిబిరం

చేవెళ్ల: ఎమ్మెల్యే కాలె యాదయ్య జన్మదినం సందర్భంగా చేవెళ్లలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ గొనే ప్రతాప్‌రెడ్డి, పామెన మాజీ సర్పంచ్ దవాల్గారి గోపాల్‌రెడ్డి తెలిపారు. చేవెళ్లలో గురువారం వారు మాట్లాడుతూ.. పట్టణంలోని కేజీఆర్ గార్డెన్‌లో శుక్రవారం ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



గ్రామ కార్యదర్శులకు సర్క్యులర్ జారీ

- పరిశ్రమలకు నోటీసులు పంపించాలని ఆదేశాలు
- ఐదురోజుల్లో సక్రమ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచన

సాక్షి ఎఫెక్ట్..

నందిగామ: మండల పరిధిలో వెలసిన అనేక పరిశ్రమలలో చాలా వరకు వాటికి సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయకపోవడం.. వాటిల్లో ఏ వస్తువులు, ఉత్పత్తులు తయారు అవుతున్నాయో తెలియని పరిస్థితి. ఈ వ్యవహారాలను పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విషయమై 'బోర్డుల ఏర్పాటులో నిర్లక్ష్యం' అనే శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. షాద్‌నగర్ డివిజనల్ పంచాయతీ అధికారి ఆదేశానుసారంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులకు ఎంపీఓ తేజ్‌సింగ్ గురువారం సర్క్యులర్(పంచాయతీ విభాగం/08/2025) జారీ చేశారు. బోర్డులు ఏర్పాటు చేయని పరిశ్రమలకు ఆయా గ్రామ కార్యదర్శులు వెంటనే నోటీసులు పంపించాలని ఆదేశించారు. పరిశ్రమలు ఉత్పత్తి చేస్తున్న వస్తు, వ్యాపార వివరాలు తెలిసే విధంగా కంపెనీలు సక్రమంగా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ పంచాయతీరాజ్ యాక్ట్ 2018 ప్రకారం కార్యదర్శులకు ఆయా పరిశ్రమలను పర్యవేక్షించే బాధ్యత ఉందని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. దీంతో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి, వ్యాపార నిర్వహణ లైసెన్సు, ఫీజుల చెల్లింపు, విధింపు తదితర వివరాలు ప్రతీ గ్రామ పంచాయతీలలో రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అంతే కాకుండా ఆయా పరిశ్రమలు అదనపు నిర్మాణాలు చేపట్టినట్లయితే ప్రాపర్టీ ట్యాక్స్ రీ అసెస్‌మెంట్ చేసి పన్నును పెంచుటకు ఆచరణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సర్క్యులర్ అందిన 5 రోజులలో అన్ని పరిశ్రమల దగ్గర సక్రమ బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

ఇబ్రహీంపట్నం: పార్టీ బలోపేతానికి కమలనాథులు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఇబ్రహీంపట్నం మండల ఇన్‌చార్జి కడారి జంగయ్య యాదవ్ పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి సమావేశాలను నిర్వహించి పార్టీ, పటిష్టతకు పాటుపడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. త్వరలో పూర్తిస్థాయి మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నామన్నారు. అనంతరం భవిష్యత్తులో చేపట్టాల్సిన పార్టీ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహారెడ్డి, ప్రతాప్, అర్జున్‌రెడ్డి, నర్సింహగౌడ్, శ్వేత, శ్రీశైలం, గణేశ్, రమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, బాబులు, విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య

షాద్‌నగర్: వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. షాద్‌నగర్ మార్కెట్‌యార్డులో వర్షానికి తడిసిన వరి ధాన్యం, మొక్కజొన్న పంటను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురిసిన అకాల వర్షానికి రైతులు ఎంతో నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మార్కెట్‌లో అమ్మేందుకు తీసుకొచ్చిన ధాన్యం, మొక్కజొన్న పంట వర్షానికి తడిసిపోయిందని, తడిసిన పంటకు కూడా ప్రభుత్వం మద్దతు ధర చెల్లించాలన్నారు. మార్కెట్ యార్డులో పదిరోజులు అవుతున్నా పంటను కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మల్చలం మురళీ, ప్యాట అశోక్, వంశీకృష్ణ, కుర్మయ్య, ప్రశాంత్, రాము, రుషికేశ్, నర్సింహ, అంజి, శివలింగం, కృష్ణ, హన్మంతు, శివశంకర్, అజయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి
- పైపులైన్ ఏర్పాటు పనులకు భూమిపూజ

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అభివృద్ధి నిధులు రూ.5 లక్షలతో మండల పరిధి మైసిగండిలో పదుశ్రీ ప్యారడైజ్ కాలనీ, ఎల్లమ్మ తండాల తాగునీటి అవసరాలకు మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణ పనులకు వారు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, పొల్యూషన్ కంట్రోల్ మెంబర్ బాలాజీసింగ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్, జగన్, నాయకులు పాల్గొన్నారు.



తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

గ్రాసం కరువై.. పోషణ భారమై



వరిగడ్డి కొనుగోలు చేసి తీసుకొస్తున్న పాడి రైతు

రియల్ వ్యాపారంతో పశుగ్రాసానికి కష్టాలు తప్పడం లేదు. సాగు విస్తీర్ణం తగ్గడం, ఉన్న కొద్దిపాటి వ్యవసాయ పొలాలు ప్లాట్లుగా మారుతుండటంతో గడ్డికి గడ్డు కాలం ఏర్పడింది. దీంతో పాడిని నమ్ముకున్న రైతులు.. మూగజీవాల పోషణ భారమై కబేళాలకు తరలిస్తున్నారు.

- మూగజీవాలపై రియల్ ఎఫెక్ట్
- ప్లాట్లుగా మారుతున్న పంటభూములు
- పశుగ్రాసం కోసం పాడి రైతుల పాట్లు
- పోషణ భారం భరించలేక కబేళాలకు తరలిస్తున్న వైనం

కడ్తాల్: మండల పరిధి గ్రామాల్లో 4 వేలకు పైగా పాడి రైతులు, 16 వేల వరకు పాడి పశువులు ఉన్నాయి. నిత్యం మండల పరిధి నుంచి 20 వేల నుంచి 25వేల లీటర్లకు పైగా పాల ఉత్పత్తి జరుగుతోంది. నీటి సౌకర్యం ఉండి, రైతులకు ప్రభుత్వం రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందజేస్తున్నా.. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి, బోర్ల కింద పచ్చిగడ్డి సాగు రైతులకు సాధ్యం కావడం లేదు. ఫలితంగా గడ్డి కొరత ఏర్పడి పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత్యంతరం లేక కొందరు రైతులు పశువులకు ఎండుగడ్డి, శనగ, పల్లి పొట్టును కొనేందుకు సిద్ధపడుతున్నారు. ఆర్థికంగా లేని వారు పశువులను కబేళాలకు విక్రయించేందుకు సిద్ధపడుతున్నారు!.



వెంచర్‌గా మారిన పంట పొలాలు

లారీ గడ్డి రూ.30 వేలు

క్రమంగా సాగు భూములు తగ్గడం, ఉన్న భూములు సాగునీటి కొరతతో బీడు వారిపోవడం పాడి రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. పశువులకు గ్రాసం లభించకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడానికి సిద్ధపడుతున్నప్పటికీ.. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ట్రాక్టర్ గడ్డికి రూ.15 వేలు, లారీ గడ్డి రూ.30 వేలకు పైగా వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. శనగపొట్టు టన్నుకు రూ.6 వేలు, మక్క పిండి రూ.3 వేలు, దాణా క్వింటాల్‌కు రూ.3,600లకు కొనుగోలు చేస్తున్నప్పటికీ అది రైతులకు అధిక భారంగా మారింది. తప్పని పరిస్థితుల్లో గడ్డి, శనగపొట్టు తదితర వాటిని కొనుగోలు చేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసం సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం పశుగ్రాసాన్ని రాయితీపై నేరుగా రైతులకు అందించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

పచ్చదనం మాయం

రియల్ వ్యాపారం పుణ్యమాని భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఫలితంగా సాగు భూములు క్రమంగా వెంచర్లుగా మారుతున్నాయి. కాలం కలిసి రాక కొందరు, వ్యవసాయం చేయలేక ఇంకొందరు తమ పంట పొలాలను విక్రయిస్తున్నారు. దీంతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. పశుగ్రాసం లేక మూగజీవాలు అల్లాడిపోతున్నాయి.

ఖర్చు పెరిగింది



పాడి పరిశ్రమను నమ్ముకొని బతుకుతున్నాం. గతంలో కరువుతో పంటలు పండక పోయినా.. పాడిపైనే జీవనం పొందేవారం. ప్రస్తుతం పశువులకు గడ్డి దొరకడం లేదు. సాగు భూములు వెంచర్లుగా మారుతుండటంతో వాటి పోషణ కష్టంగా మారింది. ఖర్చు పెరిగి, ఆదాయం తగ్గింది. రాయితీపై గ్రాసం అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలి.

– జగన్‌నాయక్, పాడి రైతు, టాక్‌రాజ్‌గూడ, కడ్తాల్

రాయితీపై ఇవ్వాలి



మండలంలో అత్యధికంగా పాడి రైతులు ఉన్నారు. మూగ జీవాలను నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నారు. రియల్ వ్యాపారంతో పచ్చని పంట పొలాలు వెంచర్లుగా మారుతుండటంతో పశువులకు గడ్డి దొరకని పరిస్థితి నెలకొంది. వాటి పోషణ భారం కావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం పాడి రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం అందజేసి ఆదుకోవాలి.

– పరమేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, కడ్తాల్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564